## క్లుప్తంగా

### కోటసత్తెమ్మ వారి ఆదాయం రూ.1.51 లక్షలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో 100 లీటర్ల పెరుగుతో చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,50,530 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

### బదిలీపై వెళుతున్న పోలీసులకు వీడ్కోలు



బదిలీపై వెళుతున్న పోలీసు సిబ్బందితో ఎస్‌ఐ సూర్య భగవాన్ తదితరులు

పెరవలి: మెరుగ్గా పనిచేసే ఉద్యోగులు బదిలీపై వెళ్లడం కొంచెం ఇబ్బందికరంగా ఉంటుందని పెరవలి ఎస్‌ఐ ఎం. సూర్యభగవాన్ అన్నారు. ఐదేళ్లుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ డి.వేంకటేశ్వరరావు, రైటర్ జి. బాలాజీలు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం పోలీసు స్టేషన్‌లో వారిద్దరినీ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తణుకు, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లపూడి: మండలంలో అర్హత కలిగిన వారందరూ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ టి.రాధిక తెలిపారు. సమీప గ్రామ సచి వాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం



దేవరపల్లి: దేవరపల్లి బీసీ కాలనీలో గుర్తు తెలియని మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు 48 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. నల్లగా ఉన్న మృతుడి ఒంటిపై లేత పసుపు రంగు ఫ్యాంటు, సిమెంట్ రంగు టీ ఉన్నట్టు వారు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

### భార్యతో గొడవ పడి అదృశ్యం

కొవ్వూరు: పట్టణంలోని మొక్కచింతల రామాలయం వీధికి చెందిన గాడి శంకర్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ నెల ఒకటో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన శంకర్ మళ్లీ ఇంటికి రాలేదు. దీనిపై అతడి భార్య అమరజ్యోతి ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె పోలీసులకు ఇచ్చిన సమాచారం ప్రకారం శంకర్ మే 31వ తేదీన నరసాపురంలో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్లి వచ్చాడు. అదే రోజు రాత్రి ఆస్తి విషయమై భార్య అమరజ్యోతితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో జూన్ ఒకటో తేదీ ఉదయం అతడు తన దుస్తులు సర్దుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

# ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం

- సొసైటీల ద్వారా రైతులకు సరఫరా
- బోర్ల కింద ఆకుమడులు
- నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో సాగు



యర్నగూడెం సొసైటీలో సరఫరాకు సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు



త్యాజంపూడిలో ఆకుమడిని సిద్ధం చేస్తున్న దృశ్యం

దేవరపల్లి: ఖరీఫ్ సాగుకు మెట్ట ప్రాంత రైతులు సన్నద్ధం అవుతున్నారు. సాగుకు అవసరమైన వరి విత్తనాలను ప్రభుత్వం సొసైటీల ద్వారా సరఫరా చేస్తోంది. సొసైటీల వద్ద విత్తనాలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన వరి విత్తనాలు పీఎల్‌పీ-1100, ఎంటీయూ 1064, ఎంటీయూ 7029, ఎంటీయూ 1121 రకాల వంగడాలను వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేస్తున్నారు. సొసైటీలతో పాటు విత్తనాల విక్రయానికి లైసెన్సు పొందిన వ్యాపార సంస్థల నుంచి కూడా రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో బోర్ల కింద సాగు ఎక్కువగా జరుగుతుంది. బోర్లతో పాటు తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ కింద మరికొంత ఆయకట్టును సాగు చేస్తున్నారు. అలాగే పలు గ్రామాల సాగునీటి చెరువుల కింద కూడా రైతులు పంటలు వేస్తున్నారు. ముందస్తు సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు తయారు చేయడంతో రైతులు ముందస్తు సాగుకు సిద్ధమవుతున్నారు. బోర్ల కింద నారుమడులు పోయడానికి రైతులు ఆకుమడులు తయారు చేస్తున్నారు.

**30,204 ఎకరాల్లో వరి సాగు**

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఖరీఫ్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 30,204 ఎకరాలు. బోర్లు, తాడిపూడి కాలువ, చెరువుల కింద వరి సాగు చేస్తున్నారు. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నాట్లు వేసేశారు. ముందస్తు సాగు ప్రణాళికల ప్రకారం జూలై నెలలో నాట్లు ప్రారంభించి ఆగస్టు వరకూ కొనసాగిస్తున్నారు. దేవరపల్లి మండలంలోని దేవరపల్లి, దుద్దుకూరు, గౌరీపట్నం, యర్నగూడెం, త్యాజంపూడి సొసైటీల వద్ద రైతులకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేశారు. మండలాలవారీగా దేవరపల్లిలో 9,500 , ద్వారకాతిరుమలలో 6,207, గోపాలపురంలో 3,604, నల్లజర్లలో 10893 ఎకరాల వరి సాగు సాధారణ విస్తీర్ణం ఉంది. ద్వారకాతిరుమల మండలానికి 310 క్వింటాళ్లు, దేవరపల్లి మండలానికి 200 క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చాయి. నల్లజర్ల మండలంలోని 95 శాతం రైతులు సంపత్ స్వర్ణ సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయదు కాబట్టి రైతులు బయట కొనుగోలు చేస్తున్నారు. గోపాలపురం మండలానికి ఇంత వరకూ విత్తనాలు రాలేదని వ్యవసాయాధికారి తెలిపారు.

**ఐదు సొసైటీల ద్వారా విత్తనాలు**



ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి విత్తనాలు సొసైటీల వద్ద అందుబాటులో ఉన్నాయి. మండలంలోని ఐదు సొసైటీల వద్ద విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయి. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. లైసెన్సు గల బయట వ్యాపార సంస్థలు, రైతుల నుంచి రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. దేవరపల్లి మండలంలో 200 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ఎక్కడా విత్తనాల కొరత లేదు.

– కె. విజయ్, వ్యవసాయాధికారి, దేవరపల్లి

### నేడు ఆర్బీకే భవనాల ప్రారంభోత్సవం

ఉండ్రాజవరం: నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు సోమవారం ఉండ్రాజవరంలో నిర్వహించే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉండ్రాజవరం సచివాలయం 1,2,3 పరిధిలోని రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారు. అలాగే గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను కూడా ఆయన ప్రారంభిస్తారు. ఈపనులకు ప్రభుత్వం సుమారు రూ.1.50 కోట్లు కేటాయించిదని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

### ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

ఉండ్రాజవరం: భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహ, నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఉండ్రాజవరంలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం పూజలు, హోమాలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 8న స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి, ద్వారపాలకుల విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముగిసిన బరింకలమ్మ జాతర



బరింకలమ్మ దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, రాజీవ్ కృష్ణ తదితరులు



అమ్మవారికి సమర్పించిన వెండి కిరీటం



తిరుగుళ్లమ్మ సోమాలమ్మ వారు

నిడదవోలురూరల్: పురుషోత్తపల్లి గ్రామదేవత బరింకలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారిని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, ప్రభుత్వ సలహాదారుడు ఎస్. రాజీవ్‌కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు తదితరులు దర్శించుకున్నారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులను సన్మానించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు పెట్టారు. జాతరకు వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామమంతా కళకళలాడింది. నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షులు సుంకవల్లి శ్రీహరి, యాళ్ల రామారావు, గజ్జరపు శ్రీరమేష్, నియోజకవర్గ సర్పంచుల చాంబర్ ప్రతినిధి తిక్కా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**తిరుగుడుమెట్టలో ఘనంగా ముగిసిన జాతర**

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామ దేవతలు తిరుగుళ్లమ్మ సోమాలమ్మ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. గత 10 రోజులుగా అమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి బలిచేట కార్యక్రమం జరిగింది. ఆదివారం ఆఖరు రోజు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. బంధువులు, ఆడపడుచులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలోని వీధులన్నీ జనంతో రద్దీగా మారాయి. ఆయా పార్టీల నాయకుల పెద్ద సంఖ్యలో స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

**సోమాలమ్మకు వెండి కిరీటం సమర్పణ**

నల్లజర్ల: నల్లజర్ల గ్రామ గ్రామదేవత అయిన సోమాలమ్మ వారికి ఆ గ్రామానికి చెందిన కండెపు వెంకట సూర్యనారాయణ, సునీత దంపతులు ఆదివారం వెండి కిరీటాన్ని సమర్పించారు. తమ కుమార్తె సౌమ్యశ్రీ వివాహ వేడుక సందర్భంగా ఆ దంపతులు అమ్మవారికి 700 గ్రాముల వెండితో దాదాపు రూ.60 వేల ఖరీదైన కిరీటాన్ని సమర్పించినట్టు ఆలయ కమిటీ తెలిపింది.

### వర్షంతో సేదతీరిన జనం

చాగల్లు: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అప్పటి వరకూ ఎండ తీవ్రత, ఉక్కబోతతో అల్లాడిన ప్రజలకు వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఉపశమనం పొందారు. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. దాంతో సామాన్యులు పగటి వేళ ఇళ్ల నుంచి బయటకు వెళ్లడం తగ్గించారు. చాగల్లు, ఊనగట్ల, ఎస్ ముప్పవరం, బ్రాహ్మణగూడెం, దారవరంతో పాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. విద్యుత్తు సరఫరాకు కొంతసేపు అంతరాయం వాటిల్లింది.

## హిందూ ధర్మ ప్రాముఖ్యతను చాటుదాం



పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీ

నిడదవోలు: హిందూ ధర్మ ప్రాముఖ్యతతో కూడిన ఐకమత్యాన్ని నలుదిక్కులా చాటుదామని భగవద్గీత ప్రచారకుడు శ్రీమాన్ రాధామనోహర్ దాస్ పిలుపునిచ్చారు. హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. హిందూ మతాన్ని గౌరవిస్తూ హిందువుగానే జీవించాలన్నారు. అనంతరం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 'హిందువునని గర్విద్దాం..హిందువుగానే జీవిద్దాం' అంటూ నినదించారు. కార్యక్రమంలో అడ్డా శ్రీనివాస్, బండి సత్యనారాయణ, నీలం రామారావు, దుర్గారావు, మోర్త సాయి, గమిని వెంకటరత్నం, విజ భాస్కర్, యడ్లపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వేగేశ్వరపురంలో అపూర్వ సమ్మేళనం




వేగేశ్వరపురం ప్రభుత్వ హైస్కూల్ 1992 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, వారి గురువులు



కొవ్వూరులో 1997- 98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో జరిగింది. పూర్వ విద్యార్థులందరూ ఒకరినొకరు పలకరించుకుంటూ, ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకుంటూ సందడి చేశారు. నాటి పాఠశాల రోజుల్లోని మధుర క్షణాలను, అప్పటి ఘటనలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలను విడిచి 30 ఏళ్లు కావడంతో నాటి మిత్రులందరూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. నాడు తమకు విద్యా బుదద్దులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు రామశాస్త్రి, వెంకటగిరి, శ్రీనివాస్, అర్జున తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొప్పుల గంగాధర్, కాళ్ల రత్నాజీ, సంకాబత్తుల పోశిబాబు, అడ్డాల చంద్రశేఖర్, మారిశెట్టి పద్మరావు, కె వెంకటేశ్వరావు, శీర్ల నాగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనాన్ని స్థానిక యువరాజ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన స్నేహితులంతా ఒకచోట చేరి ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, గోవిందరాజులు, సాయి మణిలను, పాఠశాల కరస్పాండెంట్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్రను పూర్వ విద్యార్థులు సత్కరించారు. పూర్వ విద్యార్థులు పాకా జయ రామ్, గాడి విజయరాజ్‌కుమార్, కరుటూరి శివరామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఒడిశా రైలు ప్రమాద మృతులకు సంతాపం



రైల్వేస్టేషన్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలుపుతున్న నిడదవోలు వాసులు

నిడదవోలు: ఒడిసా రైలు ప్రమాద మృతులకు పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి తీవ్ర సంతాపం తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో జువ్వల రాంబాబు, పి.రాజు, పార్థసారథి, కాకులపాటి శ్రీధర్, గండి శ్రీనివాసరావు, షాహి, డిజ రమేష్, జి.డానియేలు, వస్కా ప్రభాకర్, దాయం పండు, విస్సా గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### వెదుళ్లకుంటలో 37 మందికి ఇళ్ల స్థలాలు



ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ తదితరులు

గోపాలపురం: నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. వాదాలకుంట పంచాయతీ పరిధిలోని వెదుళ్లకుంట గ్రామంలో ఎకరం విస్తీర్ణంలో 37 మంది లబ్ధిదారులకు ఆదివారం ఇళ్ల స్థలాలు కేటాయించారు. వారికి త్వరలో ప్రభుత్వం ద్వారా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ చెప్పారు. సర్పంచ్ జొన్నకూడి మనెమ్మ, జె. శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వి. సత్యనారాయణ, కార్యదర్శి వింత రాఘవరెడ్డి, వుండవల్లి సోమశేఖర్ పాల్గొన్నారు.



## చిచ్చర పిడుగులు



కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

- కరాటేలో రాణిస్తున్న చిన్నారులు
- జాతీయ,రాష్ట్ర స్థాయిలో పతకాల పంట
- నెలపాటు కొవ్వూరులో ఉచిత శిక్షణ

కొవ్వూరు: కరాటే పట్ల ఇటీవల చిన్నారుల్లో ఆసక్తి పెరిగింది. ఆత్మరక్షణతో పాటు శారీరక దారుఢ్యానికి ఉపకరించే కరాటే అంటే మక్కువ చూపుతున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా కరాటే నేర్చుకోవడానికి పిల్లలు ఇష్టపడుతున్నారు. వారి ఆసక్తిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం శాఫ్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో ఉచిత శిక్షణ ఇస్తోంది. మే 1 నుంచి 31వ తేదీ వరకూ నెల రోజుల పాటు కొవ్వూరు అచీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా జూడో, కరాటే పోటీల్లో 60 మందికి పట్టణంలో ఉచిత శిక్షణ అందించారు. ఈ అకాడమీలో ఏటా కరాటే బెల్ట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. మే 1న నిర్వహించిన పోటీల్లో పది మంది చిన్నారులు బ్లాక్ బెల్ట్ సాధించారు. వారిలో కొందరు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. కరాటేతో పాటు ఈ అకాడమీలో జూడో, వెయిట్ లాస్, యోగ, మహిళలకు ఆత్మరక్షణ శిక్షణ వంటి అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారి అనుభవాలు వారి మాటల్లోనే..

**ఏడు సార్లు జాతీయ స్థాయి పతకాలు**



గతేడాది వైజాగ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఒక బంగారు, రెండు పతకాలు సాధించాను. ఏలూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఒక బంగారు, ఒక వెండి పతకాలు దక్కించుకున్నా.అదే ఏడాది గుజరాత్‌లో నిర్వహించిన జాతీయ పోటీల్లో ఒక బంగారు, ఒక వెండి పతకాలు సొంతం అయ్యాయి. బ్లాక్ బెల్టు సాధించాను.

– కె.శ్రీహరి కార్తికేయ, ఏడో తరగతి

**పోటీకి వెళితే పతకం తథ్యం**



రెండేళ్లుగా కరాటే శిక్షణ పొందుతున్నా. ప్రస్తుతం బ్లాక్ బెల్ట్ సాధించా.గతేడాది వైజాగ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో రెండు బంగారు, రెండు వెండి పతకాలు సొంతం చేసుకున్నా. ఏలూరులో నిర్వహించిన నేషనల్ పోటీల్లో ఒక కాంస్య, అదే ఏడాది గుజరాత్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో రెండు కాంస్య పతకాలు దక్కించుకున్నా.ఈఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో పాల్గొని రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సొంతం చేసుకున్నాను.

– ఎ.షణ్ముఖ సాయి, ఏడో తరగతి

**నాలుగుసార్లు జాతీయ స్థాయిలో..**



జాతీయస్థాయి కరాటే పోటీల్లో నాలుగు సార్లు బంగారు పతకాలు సాధించాను. 2022లో గుజరాత్‌లో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో రెండు బంగారు పతకా లు, ఏలూరులో నిర్వహించిన జాతీయ పోటీల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. ఈ ఏడాది చిలక లూరిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఒక బంగారు పతకం, ఒక సిల్వర్ మెడల్ సాధించా.రెండేళ్లుగా కరాటే సాధన చేస్తున్నా. ఈనెలలో నిర్వహించిన మొదటి బెల్ట్ టెస్ట్‌లో బ్లాక్ బెల్ట్ సాధించాను.

– జి.సూర్య అవినాష్, 8వ తరగతి, కొవ్వూరు

**కరాటేకు ఆదరణ పెరిగింది**



కరాటేను అంతర్జాతీయ క్రీడ గా గుర్తించడంతో చిన్నా రులు, యువతలో ఈ క్రీడపై ఆసక్తి పెరిగింది.ఆడ పిల్లల ఆత్మరక్షణకు కరాటే ఉపకరిస్తుంది. మా అకాడమీలో జూడో, వెయిట్ లాస్, యోగ, మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ అందిస్తున్నా. మహిళా పోలీసులకు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లలకు ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్నాను. మహిళా పోలీసులకు విధి నిర్వహణలో మెళకువలు నేర్పి స్తున్నాను.

– అళ్ల రాధ, బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్, కరాటే శిక్షకురాలు, కొవ్వూరు

### కార్మికుల సర్వీసులు క్రమబద్ధీకరించాలి

కొవ్వూరు: మునిసిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సర్వీసులను క్రమబద్ధం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. రాష్ట్ర కళాజాతా ఆదివారం కొవ్వూరు మునిసిపల్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రజా ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతున్న కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు. పూజారి వాసు, ధనాల వెంకట్రావు, బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, దేశాబత్తుల రాజేంద్ర, పోతురాజు, దొడ్డా శ్యామ్, మీసాల కళ్యాణ్, కారింకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.